# భగవద్గీతా సారసంగ్రహము



సంగ్రహణ – కూర్పు

## పె. రా. మురహరి

# విషయానుక్రమణిక

**ప్రథమ విభాగం**


1. స్మృతిపథంలో - 05
2. మున్నుడి - 07
3. అంకితం - 10
4. సుమనోహారం - 12
5. హర్షతాళం - 14
6. నానృషిః కురుతే కావ్యం - 17
7. గీతామృతం - 20
8. కృష్ణం వందే జగద్గురుం - 21
9. ప్రార్థన - 24


**ఉపోద్ఘాతం మరియు గీతా సంబంధిత విషయాలు**


1. ఏకశ్లోకీ - 27
2. గీత – పర్యాయనామాలు - 27
3. గీతా మహిమ - 28
4. పరమాత్మ ముఖ్యవచనాలు - 29
5. భావం - ప్రబోధం - 30
6. కృష్ణార్జునుల పర్యాయపదాలు - 32
7. కాలము - కాలగణనము మరియు యుగాది పర్వాలు - 32
8. అధ్యాయాలు - శ్లోకాల సంఖ్య - 38

<u>ద్వితీయ విభాగం</u>


భగవద్గీత అధ్యాయాలు - సంగ్రహసారం - 39

**కర్మషట్కము ( 1 నుండి 6 అధ్యాయాలు)** - 39

**భక్తిషట్కము ( 7 నుండి 12 అధ్యాయాలు)** - 68

**జ్ఞానషట్కము ( 13 నుండి 18 అధ్యాయాలు)** - 97


<u>తృతీయ విభాగం</u>


1. ముఖ్యశ్లోకాలు – తాత్పర్యాలు - 121
2. గీత రుణబాంధవ్యం - 141
3. పారాయణ ఫలము - 142
4. కృతికర్త పరిచయం - 143

# కర్మషట్కము (1 నుండి 6 అధ్యాయాలు)

(సంగ్రహసారం )

<u>ఒకటవ అధ్యాయం - అర్జున విషాదయోగం (47 శ్లోకాలు) </u> : ధర్మక్షేత్రే, కురుక్షేత్రే అంటూ గీత మొదటిశ్లోకం ధర్మశబ్దంతో ప్రారంభమయింది. ధర్మశబ్దం 'శ్రీ' శబ్దంతో సమానం. ధర్మం యొక్క ప్రాముఖ్యత దీన్నిబట్టి తెలుస్తోంది. ఈ శ్లోకంలో ధృతరాష్ట్రుడు కౌరవపాండవుల యుద్ధాన్ని గురించి, తన కుమారులైన కౌరవులయొక్క, పాండుపుత్రుల యొక్క వివరాలను తెలియజేయమని సంజయుని అడుగుతున్నాడు. ఈ శ్లోకంలో మరి రెండువిషయాలను తెలుసుకోవచ్చు. ఒకటి ధృతరాష్ట్రుని స్వార్థబుద్ధి. ధృతరాష్ట్రుడు అంటే, రాష్ట్రాన్ని (రాజ్యాన్ని) ధరించినవాడు కాబట్టి అది తనది, తనపుత్రులకే కావాలనే స్వార్థం. రెండు పాండుపుత్రులు అనే పదాన్ని వాడడం వల్ల పాండవులు తనకు పరాయివారనే అర్థం ధ్వనిస్తున్నాయి.

రెండవ శ్లోకం నుండి 46వ శ్లోకం వరకు అర్జునుడు కృష్ణుని సారథ్యంలో రథాన్ని అనువైనచోట నిలబెట్టుకొని, దుష్టబుద్ధి గల దుర్యోధనునికి సహకరించి ప్రియాన్ని చేకూర్చే వారందరినీ చూశాడు. తండ్రి దాయాదులను, తాతలను, గురువులను, మేనమామలను, అన్నదమ్ములను, కొడుకులను, సైనికులను, స్నేహితులను, మామలను, హితం కోరేవారిని, అలాగే ఇరువైపుల ఉన్న వారిని బాగా గమనించాడు. యుద్ధభూమిలో ఉన్న బంధువులను,మిత్రులను,తనవారిని చూసి దయార్ద్ర హృదయుడై ఎంతో దు:ఖించాడు.

తనలో చెలరేగిన విషాదాన్ని కృష్ణమూర్తికి ఈవిధంగా తెలియజేసున్నాడు. వీరందరినీ చూసి నా అవయవాలు పట్టుతప్పుతున్నాయి. నోరెండిపోతోంది. శరీరంలో వణుకు పుట్టుకొస్తోంది. గగుర్పాటు కలుగుతోంది. అస్త్రాలు జారిపోతున్నాయి. చర్మం మండుతోంది. నిలబడడానికి శక్తి లేదు. మనసు గిర్రున తిరుగుతోంది. యుద్ధం చేయడానికి మనసు కలగడంలేదు (మనస్కరించడం లేదు). దు:ఖం కలుగుతోంది.

కృష్ణా! నేను విజయాన్ని గాని, రాజ్యాన్ని గాని, సుఖాన్ని గాని కోరను. భోగభాగ్యాలతో కూడిన జీవితంతో ప్రయోజనం ఏమిటి? ఓ కృష్ణా! యుద్ధంవల్ల కులం, కులధర్మాలు నశిస్తాయి. సనాతనమైన కులధర్మాలు నశించడం వల్ల అధర్మం వ్యాపిస్తుంది. కులస్త్రీలు చెడిపోతారు. వర్ణసంకరా లేర్పడతాయి. అందువల్ల అలాంటి జనులందరికి నరకప్రాప్తే కాకుండా పితృదేవతలు, శ్రాద్ధాలు, తర్పణాలు లేనివారై అధోగతి పాలౌతారని అంటూ శోకంతో కలతచెంది, అస్త్రాలను విసిరి రథంమీద చతికిలబడ్డాడు.

47వ శ్లోకంలో సంజయుడు ఈ విషయాలను ధృతరాష్ట్రునికి తెలిపాడు.

**ఈ అధ్యాయం ద్వారా మనకింకా తెలిసే విషయాలు**

కురుక్షేత్రం గొప్ప పుణ్యక్షేత్రం. పంజాబు రాష్ట్రంలో అంబాలా పట్టణానికి దక్షిణంలో ఇంద్రప్రస్థకు (ఢిల్లీకి) ఉత్తరంలో ఉంది.

సంజయుడు అంటే, సమ్యక్ జయము కలవాడు. దేహం, ఇంద్రియాలు, అరిషడ్వార్గాలు మొదలైన వాటిని తెలియజేసిన మహాజ్ఞాని.వ్యాసమహర్షి అంశతో కురువంశంలో జన్మించిన దాసీపుత్రుడు. ఇతనికే విదురుడు అని మరోపేరు; ధృష్టద్యుమ్నుడు పాండవుల సేనాధిపతి. ద్రుపదుని కుమారుడు. ద్రౌపదికి సోదరుడు; శిఖండి కూడా ద్రుపదుని సంతానమే. మహారథుడు. 10వేల సేనతో ఒక్కడే యుద్ధం చేయగల సమర్థుడు; యమధాముడు (సాత్యకి), ధృష్టకేతువు (శిశుపాలుని పుత్రుడు); పురుజిత్, కుంతిభోజుడు (కుంతీదేవి సోదరులు); ఉపపాండవులు అనగా ద్రౌపది పుత్రులు 5గురు -ప్రతివింద్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు మరియు శ్రుతసేనుడు.

శ్రీకృష్ణుని శంఖం పేరు పాంచజన్యం, అర్జునునిది దేవదత్తం, భీమునిది పౌండ్రం, ధర్మరాజుది అనంత విజయం, నకులునిది సుఘోషం, సహదేవునిది మణిపుష్పకం.

**రెండవ అధ్యాయం - సాంఖ్యయోగం (72 శ్లోకాలు)** : శ్రీమద్భగవద్గీతలోని రెండవ అధ్యాయానికి వ్యాసమహర్షి తెలిపిన పేరు సాంఖ్యయోగం. సాంఖ్య అనే పదం సంఖ్యనుండి వచ్చింది. ఉదాహరణకి దాశరథి అనే పదానికి అర్థం భాషాపరంగా దశరథుని పుత్రుడైన శ్రీరామునిగా తెలుపుతుంది. కాని మనకు దాశరథి అనగానే స్ఫురించేది పురుషోత్తముడైన పరమాత్మయే (శ్రీరామచంద్రుడే)! సాంఖ్యయోగంలో కూడా అంతటి గూఢార్థం దాగి ఉంది. అంటే, సాంఖ్యయోగం అనగానే పురుషోత్తముడు స్ఫురిస్తాడు.

సామాన్య మానవులమైన మనకందరకూ ఇహపరమైన సుఖం-దుఃఖం, మంచి-చెడు, పగలు-రాత్రి వగైరాలు తెలుసు. కాని తత్త్వవేత్తలు అలా కాకుండా యావత్ భగవంతుని సృష్టినే విశ్లేషించి, ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో గ్రహించి, వాటిని ఆత్మ(శాశ్వతం) గా, అనాత్మ (అశాశ్వతం) గా తెలిపారు. భగవంతుడు ఒక్కడే శాశ్వతుడు. మిగిలినదంతా అశాశ్వతమే అనగా అనాత్మతత్త్వమే. భగవత్స్వరూపమైన పరమార్థవస్తువు (లేక అత్మవస్తువు) ఒకే ఒక్కటి. కాని అశాశ్వతమైన అనాత్మపదార్థాలెన్నో! విజ్ఞులు వీటిని 24గా తెలిపారు. మరికొందరు 96 (నాలుగు రెట్లు) గా తెలిపారు. తెలియవలసిం దేమిటంటే, ఈ అనాత్మ అంశాలు (వస్తువులుగా కూడా) సంఖ్యలలోనే ఉండి ఆత్మలోనే నిబిడీకృతమై ఉన్నాయి. అంటే, అనాత్మలన్నీ పరమార్థంలోనే ఉన్నాయి. ఈ అధికసంఖ్యలలో ఉన్న అనాత్మ విషయాల నన్నిటినీ అర్థం చేసుకొని వాటిని అధిగమించి, శాశ్వతమైన ఆత్మ (వస్తువు) ను ఎలా తెలుసుకోవాలో తెలుసుకొని ఎలా చేరుకోవాలో విశదపరచే అధ్యాయమే సాంఖ్యయోగమని వ్యాసమహర్షి పిలుపునిచ్చాడు.

**తెలిపిన 24 అనాత్మపదార్థాలు** :-

1. పంచభూతాలు (5) ఆకాశం, గాలి, అగ్ని, నీరు, భూమి.

2. పంచ తన్మాత్రలు (5) శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం (వాసన)

3. జ్ఞానేంద్రియాలు (5) కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం

4. కర్మేంద్రియాలు (5) వాక్కు (మాట), పాణి (చేయి), పాదం (కాలు) ఉపస్థ (కూర్చోవడం), పాయువు (మలద్వారం)

5. అంత:కరణ చతుష్టయం (4) మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం.

అర్జునుని దీనస్థితిని చూసి కృష్ణుడు అతనికి ధైర్యం చెప్పడానికి ఆత్మయొక్క నిజస్వరూపాన్ని (తత్త్వాన్ని), కర్మ రహస్యాన్ని, క్షత్రియ ధర్మాన్ని అనుసరించి యుద్ధం చేయవలసిన ఆవశ్యకత, నిష్కామకర్మ యొక్క యోగప్రతిపాదన, స్థితప్రజ్ఞుని లక్షణాలు మొదలైనవి బోధిస్తున్నాడు. అసలు గీతోపదేశం ఈ అధ్యాయంతోనే మొదలయింది. మొదటి అధ్యాయంలో చెప్పిన విధంగా అర్జునుడు రథం మీద కూర్చొని దు:ఖిస్తూ ఉండగా శ్రీకృష్ణుడు అతనిని ఉత్తేజపరచడానికి, యుద్ధోన్ముఖుని చేయడానికే కావించిన గీతోపదేశం ఈవిధంగా మొదలయింది. హే! అర్జునా! పిరికితనం, అధైర్యం చాల నీచమైనవి, తగనివి. మనో వ్యాకులత్వాన్ని విడిచిపెట్టు. దు:ఖింపదగని వారిని గురించి దు:ఖించకూడదు. పండితులైన వారు మరణించిన వారిని గురించిగాని, జీవించియున్న వారిని గురించిగాని దు:ఖించరు.

11వ శ్లోకం గీతకు అంకురం లాంటిది. గీతాతత్త్వ మంతా ఇందులో ఇమిడి ఉంది. జీవుని యొక్క ఈ శరీరానికి బాల్య, యౌవన, వార్ధక్యాదు లెలా కలుగుతాయో అదేవిధంగా మరణం సంభవించిన తరువాత మరొక శరీరంలో అవన్నీ సంభవిస్తున్నాయి. ఈవిషయమై జ్ఞాని దు:ఖించడు. ఈ మార్పులు దేహానికే గాని, ఆత్మకు లేవు. ఓ అర్జునా! శీతోష్ణ సుఖదు:ఖాలలో సమానబుద్ధి కలిగి తేడా లేకుండా మెలిగేవాడే సమబుద్ధితో ధీరపురుషుడై మోక్షానికి అర్హత కలవాడౌతాడు. అశాశ్వతమైన దేహానికి ఉనికి లేదు. ఆత్మ శాశ్వతమైనది. దానికి లేమి లేదు. శాశ్వతంగా ఉన్న పరమాత్మ లేదనుకోవడం, అశాశ్వతమైన జగత్తు ఉందనుకోవడం ఈ రెండుగుణాలు దు:ఖానికి కారణమౌతున్నాయి.

అందుచేత దానిని (పరమాత్మ-ఆత్మ) ఉన్నట్లుగానే, లేనిదానిని (శరీరం-ప్రపంచం) లేనట్లుగానే తెలుసుకోవడం వల్ల శాంతి కలుగుతుంది. అదే మోక్షానికి మార్గం కాగలదు. ఇది తెలుసుకోవడమే జ్ఞానం.

హే! అర్జునా! ఈ సమస్తవిశ్వం దేనిచేత కలిగి వ్యాపింపబడుతోందో (సృష్టింపబడి వ్యాపిస్తోందో), అదే పరమాత్మ. శాశ్వతమైనది, నాశరహిత మైనది (అనశ్వర మైనది). అందుచేత ఆత్మకు ఎవడూ వినాశం కలిగించలేడు. నాశరహితము, శాశ్వతము ఐన ఆత్మను కలిగిన దేహి, దేహం అశాశ్వతమైనదని (నశ్వరమైనదని), ఆత్మ నాశనం లేనిది శాశ్వతమైన దని తెలుసుకుంటే, చావుపుట్టుకలు దేహానికే గాని, ఆత్మకు కాదని విచారించి యుద్ధంచెయ్యి. యుద్ధంలో చంపబడేది శరీరం. చంపబడనిది ఆత్మ. కాబట్టి, నీవు చంపక పోయినా, దేహాలకు మరణం తప్పదు. అయినా ఆత్మలు చంపబడవు. శరీరం లేకపోయినా ఆత్మ లేనిది కాదు. ఎందుచేత నంటే, ఆత్మకు చావుపుట్టుకలు లేవు. మనం దుస్తులను మార్చుకొన్నట్లుగా ఆత్మ దేహాన్ని మార్చుకోగలదు. దేహం అశాశ్వతమైనది. అందుచేత మానవుడు నశింపని ఆత్మే తానని భావిస్తే, మరణభయానికి చోటుండదు. నిర్భయత్వం కలుగుతుంది. అందుచేత నువ్వు యుద్ధం చెయ్యి. జీవాత్మ శిథిల శరీరాన్ని వదలి మరొక శరీరాన్ని ధరిస్తుంది. శస్త్రాలు ఆత్మను గాయపరచలేవు, ఛేదించలేవు. అగ్ని దహించలేదు. నీరు తడుపలేదు. గాలి శోషింపలేదు. ఇవి ఏవీ ఆత్మకు ఇసుమంత మార్పును కూడా తేలేవు. ఆత్మ సర్వవ్యాపి. ఇంద్రియాలకు గోచరంకాదు. జీవునికి 1.శరీరం 2.మనస్సు 3. ఆత్మ అనే ఈ మూడూ ఉన్నాయి. ఇవి ఒకదాని కన్న మరొకటి అతి సూక్ష్మమైనవి. మనసు సూక్ష్మంగా ఆలోచిస్తే అర్థమౌతుంది గాని, ఆత్మసూక్ష్మతను తెలుసుకోవడమే ముఖ్యం. శరీరం పాంచభౌతికం. కాబట్టి అస్త్రశస్త్రాలు శరీరాన్నే బాధించగలవు గాని ఆత్మను ఏమీ చేయలేవు. జన్మించిన వారికి మరణం తప్పదు. మరణించిన వారు మళ్ళీ జన్మించక తప్పదు. ఈ విషయాన్ని గురించి శోకించడం అసమంజసం. ఎవరైనా తమధర్మాన్ని

నెరవేర్చాలి. నువ్వు క్షత్రియుడవు. యుద్ధం చేయడం నీధర్మం. అంటే, క్షత్రియధర్మం. అందువల్ల యుద్ధం చేసి, నీధర్మాన్ని ఆచరించు.

కోరికలు లేకుండా, ఫలితాన్ని ఆశించకుండా చేసేదే నిష్కామకర్మ. దీనివల్ల నష్టమేమీ కలగదు. ఈయోగం (కర్మ) మధ్యలోఆగిపోతే, ఫలితం కలగలేదని కాదు. తప్పక ఫలితం కలుగుతుంది. ధర్మం కొద్దిపాటిదే ఐనా, మహాఘోరమైన జనన మరణాల వంటి సంసారభయాలను తొలగిస్తుంది. కర్మను చేయడంలోనే నీకు అధికారం ఉంది. కాని, నీవు ఫలితాన్ని ఆశించడంలో లేదు. ఎందుకంటే, అది నీచేతిలో లేదు. అంటే నువ్వు దానిని కలుగజేయలేవు. అంటే, జీవుడు కర్మఫలాన్ని ఆశించకూడదు. అదే నిష్కామకర్మ. ఈకర్మ ననుష్ఠించినవాడు కర్మబద్ధుడు కాలేడు. నువ్వు అలాంటి యోగనిష్ఠ (నిష్కామ కర్మయోగం) లో ఉండి, సంగాన్ని త్యజించి, కార్యం ఫలించినా, ఫలించక పోయినా సమభావం కలిగి కర్మల నాచరించాలి. అలాంటి సమబుద్ధే యోగ మనబడుతుంది. మానవుడు పనిని ప్రారంభించి యోగస్థుడవ్వాలి. అనగా అత్మబుద్ధిని, దైవ (పరమాత్మ) బుద్ధిని బాగా అలవరచుకోవడమే యోగం. యోగస్థుని కర్మ మోక్షానికి మార్గాన్ని చూపుతుంది. విజ్ఞుడు సమతత్వబుద్ధి, యుక్తమైన నిష్కామ కర్మనే ఆచరించాలి. కామ్యకర్మలను అంటే, కోరికలతో చేసే కర్మలను త్యజించాలి. సమతత్వబుద్ధి గలవాడు (నిష్కామ కర్మయోగి) పాపపుణ్యాలను రెండింటిని ఈజన్మలోనే తొలగించుకుంటున్నాడు.

అందువల్ల ఓ అర్జునా! నీవు క్షత్రియుడవు. యుద్ధంచేయడం క్షత్రియధర్మం. నువ్వు స్వధర్మంతో చేసిన యుద్ధంలో జయించినా, మరణించినా స్వర్గాన్ని (మోక్షాన్ని) పొందుతావు. జయిస్తే, రాజభోగాలను అనుభవించి, క్షత్రియధర్మాన్ని కాపాడినవాడ వౌతావు. ఏది జరిగినా నీకు శ్రేయస్కరమే! అందుచేత నిష్కామ యోగివై నీధర్మాన్ని నెరవేర్చు. యుద్ధం చెయ్యి.

హే! అర్జునా! నువ్వు నీ ఆత్మసంయమనం కోసం సర్వేంద్రియాలను నిగ్రహించి మనసును నామీద లగ్నంచెయ్యి. అప్పుడే ఆత్మస్వరూపాన్ని, పరమాత్మ స్వరూపాన్ని తెలుసుకొని, స్థిరమైన జ్ఞానం కలవాడ వౌతావు. ప్రపంచంలో మానవుడు శబ్దాది విషయాలను గ్రహించడం వల్ల, వాటిని గూర్చి ఆలోచించడం వల్ల వాటిమీద ఆసక్తి కలుగుతోంది. ఆసక్తి కోరికను కలుగజేస్తుంది. కోరిక ఫలించక (అనుకున్నది జరగక) కోపం, దానివల్ల అవివేకం, తెలివిని పోగొట్టుకోవడం, మతిమరుపు, దానివల్ల బుద్ధినాశం, అందువల్ల అధోగతి సంభవిస్తాయి. అంటే, ఇంద్రియనిగ్రహం లేని వానికి వివేకం కలుగక అశాంతి కలుగుతుంది. ఆత్మచింతన లేని వానికి శాంతి లభించదు. అనగా సుఖముండదు. రాగద్వేషాలు లేనివాడు, ఇంద్రియ స్వాధీనం కలవాడు శాంతిని పొంది, మనోనిర్మలత్వంతో, సమస్త దుఃఖాలు లేనివా డౌతాడు. కోరికలు, అహంకారం లేనివాడు, మమకారాలను వదలిన వాడు శాంతిని పొంది, సర్వకాల సర్వావస్థలయందు ఇంద్రియనిగ్రహం, కామవర్జన, ఆత్మచింతనల వల్ల బ్రహ్మానుభవస్థితిని పొందుతాడు. అలాంటి స్థితివల్ల జీవుడు బ్రహ్మానందరూపమైన మోక్షాన్ని పొందుతాడు. జన్మలన్నీ కర్మవశం వల్ల కలుగుతున్నాయి. అనగా శరీరాలు కర్మవశాన పుడుతున్నాయి. పూర్వకర్మ ఫలాన్ని అనుభవించడనికే ఆత్మ శరీరంతో సంబంధం పొందుతోంది. ఆ కర్మఫలం తీరగానే శరీరం నశిస్తోంది.

కావున ఓ అర్జునా! ఈ భీష్మద్రోణాదులను నువ్వు చంపకపోయినా, వారికి మరణం తప్పదు. వారు నాచేత చంపబడతారు. నువ్వు నిమిత్తమాత్రుడవు. నీకు కీర్తిప్రతిష్ఠలు చేకూరడానికే ఈ యుద్ధం చేయమంటున్నాను. ఎందుకంటే, నీవుక్షత్రియుడవు. ఇందులో నువ్వు ఎంతమందిని చంపినా అది పాపంకాదు. స్వధర్మమైన యుద్ధం చేయడమే నీకు శ్రేయస్కరం. అందుచేత ఓ అర్జునా! కరుణ, జాలి, మమకారాలను వదలి నీ స్వధర్మమైన యుద్ధాన్ని ఆచరించు. లే! అస్త్రశస్త్రాలను తీసుకొని, సిద్ధపడు!

20వ శ్లోకం ఆత్మస్వరూపాన్ని,31,37 శ్లోకాలు క్షత్రియధర్మాన్ని,స్వధర్మాన్ని, 55వ శ్లోకం స్థితప్రజ్ఞుని గురించి తెలుతున్నాయి. రాగద్వేషాలను వదలి నిర్మలమైన మనసుతో నిరంతరం సంతుష్ఠితో ఉండేవాడు స్థితప్రజ్ఞు డౌతున్నాడు. వాంఛిత ప్రియవిషయాలలో అభిమానం లేనివాడు స్థితప్రజ్ఞుడని తెలుసుకోవాలి.

ఇంద్రియనిగ్రహం కలిగి, బాహ్యవిషయాల నుండి చిత్తాన్ని వదిలించి, అంతర్ముఖుడై, మోక్షాన్ని గురించి తీవ్రాభిలాషతో యత్నించే ధీరుడే ప్రత్యగాత్మను సాక్షాత్కరించుకో గలడు (కఠోపనిషత్తు). మోక్షప్రాప్తికి నిష్కామకర్మ అత్యంత ఆవశ్యకం. ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా కర్మచేయబడుతోంది. అంటే, ఇంద్రియాలచేత చూడబడేది, వినబడేది, మాట్లడబడేది, చేసేది కూడా ప్రత్యక్ష కర్మలే! ఇతరులచేత (వేరొకరిచేత) ఈ మూడువిధాలుగా చేయించడం కూడా కర్మే ఔతుంది.

మనసు, ఆత్మల కలయికయే యోగం. జీవ, పరమాత్మల సంయోగమే యోగం. తమస్సుకు అందనిది పరమాత్మ. కర్మలోని నేర్పరితనమే యోగం. మోక్షప్రాప్తికి ఎవరి సాధన వారివల్లనే ఔతుంది. సాధన ప్రారంభించడమే మోక్షానికి దారిచేయడం. ఆధ్యాత్మిక క్షేత్రంలో మరెవ్వరికీ చోటులేదు. వాసనలు నశించకపోతే, ఆత్మదర్శనం కాదు. మానవుడు బుద్ధినాశం వల్ల నశించిపోతున్నాడు.

ఇంద్రియాలను, మనసును స్వాధీన పరచుకొన్న స్థితప్రజ్ఞుడు వాటికి దాసుడు కాడు. పరతంత్రాలను పారద్రోలి, వివేక వైరాగ్యాలచేత, భగవద్భక్తిచేత వాటిని వశీకరించుకొని పరమశాంతిని, ఆనందాన్ని పొందేవాడు స్థితప్రజ్ఞుడు. మనోనిర్మలత్వం కలిగిన తరువాత సమస్త దు:ఖాలు తొలగి, సుఖమనే మాయకు దూరమై, బుద్ధి శీఘ్రంగా ఆత్మసంయమనంచేత పరమాత్మయందు స్థిరంగా నిలుస్తుంది.

శాంతిని, సుఖాన్ని పొందదలచిన వారు నాలుగు ముఖ్యమైన సాధనాలను ఆచరించాలి. 1. కోరికలు - శబ్దాది విషయాలను త్యజించడం 2. వానియందు అభిలాష లేకపోవడం 3. అహంకారాన్ని పారద్రోలడం 4. మమకారాన్ని విసర్జించడం. అలా చేసిన స్థితే బ్రాహ్మీస్థితి. అంత్యకాలంలో కూడా ఇలాంటి స్థితిని కలిగి ఉండాలి. కాని అంత్యకాలం ఎప్పుడు వస్తుందో తెలియదు కాబట్టి ఎప్పుడూ అలాంటి స్థితిని కలిగి ఉండాలి.

**ఈ అధ్యాయం ద్వారా మనకింకా తెలిసే విషయాలు**

క్లైబ్య మంటే పిరికితనం. 3.వ శ్లోకంతో గీత చదివిన ఫలితం కలుగుతుంది. శ్రీకృష్ణుడు గురువు కాగా అర్జునుడు శిష్యుడు. 11వ శ్లోకంలో గీతాతత్త్వం నిండి ఉంది. సత్, చిత్, ఆనందం అనేవి సత్యాలు.

ఆత్మ నిత్యమైనది. తాను ఆత్మయేగాని దేహం కాదు. జీవులందరిలోను ఆత్మ వ్యాపించి ఉంది. జీవునికి నాలుగవస్థలు. బాల్యం, యౌవనం, వార్ధక్యం, దేహాంతరప్రాప్తి. అమృతత్త్వ పదవే మృత్యురహితమైన ఆత్మస్థితి. అదే మోక్షం. ఆధ్యాత్మిక క్షేత్రంలో సోమరులకు చోటులేదు.

వేదాలలో మూడుభాగాలున్నాయి. అవి 1. కర్మకాండ, 2. ఉపాసనకాండ, 3. జ్ఞానకాండ. కర్మకాండనే పట్టుకొని మిగిలిన రెండింటిని వదలివేయకుండా నిష్కామకర్మనే చెయ్యాలి. అది ఉపాసన మరియు జ్ఞానకాండల వల్ల కలుగుతుంది.

వేదాలు విషయాలను తెలిపేవిగా ఉన్నాయి. కాని,పూర్వభాగం కర్మకాండలో వేదాలు సంసారవిషయాలను తెలుపుతున్నట్లుంటాయి. అందువల్ల వీటిలో సత్వరజస్తమో గుణాలు కలిగించ గలవు. ఈ త్రిగుణాలను వదలి, ద్వంద్వాలు లేకుండా శుద్ధతత్త్వంతో యోగక్షేమాల దృష్టి లేకుండా జీవుడు ఆత్మజ్ఞాని కావాలి.

మూడవ అధ్యాయయం - కర్మయోగం (43 శ్లోకములు) :

లోకంలో ఏ జీవీ కర్మ చేయకుండా ఉండదు. వారి వారికి సంబంధించిన కర్మలను నిష్కామబుద్ధితో చేయాలి. ఫలాపేక్ష లేకుండా తమ ధర్మాన్ని ఆచరించాలి. బంధం ఏ కర్మవల్ల కలుగుతుందో, ఏ కర్మ మోక్షప్రాప్తికి దారితీస్తుందో ఈ అధ్యాయంలో తెలుస్తుంది.

జనులు తరించడానికి 1.కర్మయోగం, 2.జ్ఞానయోగం అని రెండు మార్గాలను భగవంతుడు బోధిస్తున్నాడు. మొదటనే జ్ఞానయోగం కలగదు. ముందు కర్మయోగం వల్ల జ్ఞానం కలుగుతుంది. నిష్కామకర్మ, వాసనా త్యాగం ఇవి ఆవశ్యకాలు. ఫలాపేక్ష లేకుండా పరమపురుషుని ఆరాధించాలి. అదే ఫలాన్నిచ్చే కర్మ. దీనివల్ల మనసులోని దోషాలు తొలగిపోయి ఇంద్రియ, విషయ వ్యాకులత నశిస్తే, తరువాతి జ్ఞానయోగానుష్ఠానికి మార్గం. శాస్త్రనియమిత కర్మచేత, ధర్మం నిర్దేశించిన కర్మచేత చిత్తశుద్ధి కలిగి, ఆత్మజ్ఞానోదయం కలుగుతుంది. కర్మ లేకపోతే, చిత్తశుద్ధి లేదు. జ్ఞానం లభించదు. జ్ఞానం లేని ముక్తికి మార్గం దొరకదు. దేహయాత్ర కూడ కొనసాగదు. అందుచేత పరోపకార కర్మ భగవంతునికి ప్రీతిపాత్రమైన కర్మ. సంగరహితమైన కర్మఫలాపేక్ష లేకుండా చేసిన కర్మచేత బంధింప బడకుండా జ్ఞానయోగం కలుగుతుంది. బ్రహ్మదేవుడు మానవునికి జన్మతోపాటు బంధవిముక్తు డవడానికి సాధనోపాయాలను కూడా సృష్టించాడు. అవే యజ్ఞయాగాదులు. యజ్ఞాల చేత దేవతలకు తృప్తి. అందువలన వర్షాదులు కలుగుతాయి. జీవులకు వర్షాదుల చేత తృప్తి. ఈరకమైన పరస్పర తృప్తి సర్వమానవ శ్రేయస్సును కలుగజేస్తుంది. యజ్ఞాల ద్వారా భగవంతుని ఆరాధించడం చేత చిత్తశుద్ధి కలిగి జ్ఞానం ఆవిర్భవిస్తే, దానివల్ల మోక్షం కలుగుతుంది. యజ్ఞాలచేత ఆరాధింప బడిన భగవంతుడు జనులకు ఇష్టమైన, అన్నాది అవసరమైన పదార్థాల నిస్తాడు. జీవుడు వెంటనే వాటిని భగవంతునికి నివేదన చేసి, శేషాన్ని (ప్రసాదాన్ని) భుజించాలి. యజ్ఞాలలో సర్వవ్యాపియైన బ్రహ్మం ప్రతిష్ఠితమై ఉంది. యజ్ఞాల వల్ల మేఘం, మేఘాల వల్ల వర్షం, దానివల్ల అన్నం కలుగుతున్నాయి. అన్నంవల్ల

జీవులు కొనసాగడమే కాకుండా సత్కర్మ కలుగుతోంది. అందుచేత జీవులు దేశసౌభాగ్యం కోసం, ఆత్మశుద్ధి కోసం సత్కర్మలు చేయాలి. పరమాత్మ నుండి వేదం ఆవిర్భవించింది. వేదం నుండి కర్మ జనించింది. అందువల్ల సర్వమందున్న బ్రహ్మం యజ్ఞంలో ప్రతిష్ఠితమై ఉంది. సోమరితనం లేకుండా అత్యంత జాగరూకతతో, ఆధ్యాత్మిక చింతనతో ఫలితాలను పరమాత్మకు వదలివేసి, వారు మమకారం లేక నిశ్చింతతో సత్కార్యాలను ఆచరించాలి.

భవరోగ పీడితులకు నాలుగు మందులు (ఔషధాలు) చెప్పబడ్డాయి. 1. ఆధ్యాత్మిక చిత్తం 2. ఆశలేకపోవడం 3. మమకారం లేకపోవడం 4. సమస్త కర్మల ఫలితాలను నిశ్చింతతో భగవదర్పణ చేయడం. పరధర్మం కంటె స్వధర్మం గొప్ప. అది కష్టమైనా మేలు చేస్తుంది. క్షత్రియుడవు కావున యుద్ధం చేయడం స్వధర్మం. అందులో మరణం సంభవించినా ధర్మబద్ధమే. ఈ విధంగా ఆత్మ బుద్ధికంటె శ్రేష్ఠమైనదని తెలుసుకొని దేహ, ఇంద్రియ, మనస్సులను నిగ్రహించి కామమనే శత్రువులను సంహరించి, స్వధర్మ కర్మను నెరవేర్చు. కామం ఎంత అనుభవించినా తృప్తి లేనిది. అది అగ్ని వంటిది. ఇంకా కావాలని అనిపిస్తుంది. అందుచేత అది జీవునికి ప్రబలశత్రువు. ఏ విధంగానైతే పొగచేత అగ్ని, ధూళిచేత అద్దం , మావిచేత గర్భస్థ శిశువు కప్పబడి ఉంటాయో, అదేవిధంగా కామంచేత ఆత్మజ్ఞానం కప్పబడి ఉంటుంది. అందుచేత అర్జునా! ఇంద్రియ నిగ్రహం చేత కామమనే శత్రువును జయించి,ఆత్మను తెలుసుకొని,నీ స్వధర్మమైన యుద్ధం చేయడంచేత కర్తవ్యం నెరవేర్చడానికి సిద్ధమై లే! యుద్ధం చెయ్యి.' అని శ్రీకృష్ణుడు అర్జునునికి బోధించాడు.

ఈ అధ్యాయంలో కర్మకంటె జ్ఞానం శ్రేష్ఠమని తెలుస్తోంది. కర్మ చేయకపోవడం కంటె చేయడమే శ్రేష్ఠం. పరధర్మం చేయడం కంటె స్వధర్మం చేయడమే మేలైనది. యజ్ఞయాగాదులు; భక్తి, పూజా విధానాలతో మానవాళికి శ్రేయస్సు కలుగుతుంది. నీకు దొరికినది ఏదైనా భగవంతుని ప్రసాదమే! దానిలో ఒకింత త్యాగంచేసి భుజించు. నీకున్న దానిలో కొంత భగవంతునికి (మొదట) సమర్పించి భజించు. (అంటే స్వార్థమే పాపహేతువని

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Bhagavadgita+Sarasangrahamu**

* * *